క్లుప్తంగా

కృతజ్ఞతాపూర్వక కలయిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ఆకుల శ్రీనివాస్‌కుమార్ మంగళవారం సాయంత్రం గుంటూరులోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనను సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. మీ ప్రోత్సాహంతోనే తనను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారని, తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు పని చేస్తానని ఆకుల చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసే వరకు విశ్రమించనని, అందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తానని ఆళ్ల అయోధ్య రామిరెడ్డికి వివరించారు.

రెండో రోజుకు చేరిన మరకత శివలింగ వాయు ప్రతిష్ఠ



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యాన మరకత శివలింగ వాయు ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు లోక కల్యాణార్థం విశేషంగా హోమాలు నిర్వహించారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూసూరు గౌతంరెడ్డి దంపతుల చేతులమీదుగా పూజలు, అభిషేకం, హోమం జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నేత్ర పర్వంగా చిన్నారుల నృత్య ప్రదర్శన



విజయవాడకల్చరల్: శ్రీసీతారామ కల్యాణం, నూతన సంవత్సర ఉగాది వేడుకల సందర్భంగా సత్యనారాయణపురం గిరి వీధిలోని కళా వేదికపై మంగళవారం అభినయ నృత్య వేదిక నిర్వాహకురాలు, నాట్యాచారిణులు వీ కృష్ణగౌతమి, సీహెచ్ ప్రసన్న ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి సంప్రదాయంలో పలు అంశాలను ప్రదర్శించారు. వినాయక కౌతం, మహాగణపతిం, సిరి నవ్వులనాడే, పలుకే బంగార మాయనా, భోశంభో, భామా కలాపం, తందనానా, బాలకనక మయ, మధుర మీనాక్షి అంశాలను ప్రదర్శించారు. హిమజ, రుచిత, రమ్య, వర్షిణి, మేఘన, ధనప్రియ, ప్రేమ సాయి, లోక్షిత, రిషిత, చైతక్ష నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని వీ సురేష్ పర్యవేక్షించారు. తంగిరాల రాఘవశాస్త్రి చిన్నారులను ఆత్మీయంగా సత్కరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో క్రీడాకారుల సత్తా



విజయవాడస్పోర్ట్స్: ఈ నెల 20, 21 తేదీల్లో కానూరులో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో విజయవాడ ఎస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించి సత్తా చాటారు. అండర్-17 విభాగంలో కె.సుప్రీత్ గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-7 విభాగంలో గోకుల్‌నందన్ రెడ్డి సిల్వర్, కె.సురార్చిత్ నాల్గవ స్థానాన్ని, అండర్-9 విభాగంలో బి.శ్రీవశిష్ట సిల్వర్, అండర్-11 విభాగంలో ఎ.సుహాస్ సిల్వర్, జె.లాలస బ్రాంజ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ పి.రేణుక, చీఫ్ కోచ్ ఎం.ఎం.ఫణికుమార్ అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన చాటల ప్రియాంక తన భర్త, పిల్లలతో నివాసం ఉంటుంది. ప్రియాంక భర్త రాజు మద్యం తాగి వచ్చి వేధింపులకు గురి చేసేవాడు. గతంలో పలు మార్లు ఇదే తరహాగా వేధింపులకు పాల్పడగా, తల్లిదండ్రులైన లక్ష్మి, పేరయ్య సర్ది చెప్పి పంపేవారు. ఈ నెల 16న ప్రియాంక తల్లి దగ్గరకు వచ్చి రూ.2 వేలు కావాలని అడిగి తీసుకుంది. తర్వాత కూతురు కనిపించకపోవడంతో అల్లుడిని ఆరా తీశారు. అయితే ప్రియాంక జాడ లేకపోవడంతో ఆమె తల్లి లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

జన బలంతో జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి

- ధనబలంతో నెగ్గాలనుకోవడం సుజనా చౌదరి అవివేకం
- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): అశేష జన బలంతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం తథ్యమని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పేర్కొన్నారు. బ్యాంక్‌లకు ఎగ్గొట్టిన సొమ్మును తీసుకువచ్చి కేవలం ధన బలంతో ఇక్కడ నెగ్గాలనుకోవడం బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి అవివేకమని అన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ఇప్పుడు గడప గడపకు వెళ్లి ఓటు అడగగలుగుతున్నామని, చంద్రబాబు కూటమి ప్రజలకు ఏం మేలు చేశారని ఓటు అడుగుతారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, ఆమె తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆసిఫ్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, డివిజన్‌లో చేసిన అభివృద్ధి గురించి వివరిస్తూ ఇవన్నీ కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. సరిగ్గా ఎన్నికల సమయంలోనే సాధ్యంకాని హామీలను ఇచ్చే చంద్రబాబు కూటమి చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మవద్దని కోరారు.



38వ డివిజన్‌లో కరపత్రం అందజేస్తున్న ఆసిఫ్, నాయకులు

కొండ ప్రాంతాల్లోనూ ఇళ్ల పట్టాలిచ్చాం..

నాలుగు దశాబ్దాలుగా కొండ ప్రాంతంలో నివసిస్తున్న వారి ఇళ్లను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్ ప్రభుత్వానిదేనని ఆసిఫ్ పేర్కొన్నారు. నగరంలో కొంత మంది పేదలకు అమరావతి ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే కోర్టుకు వెళ్లి అడ్డుకున్న చంద్రబాబు కూటమికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని చెప్పారు. గతంలో అమరావతి అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపించిన చంద్రబాబు 23 సీట్లకే పరిమితం అయ్యాడని గుర్తు చేశారు. అదే తరహాలో ఇప్పుడు సుజనా చౌదరి కొండ ప్రాంతాన్ని సింగపూర్ చేస్తానంటే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో తిరుపతి తరువాత రెండో ప్రధాన ఆలయంగా ప్రసిద్ధి చెందిన కనకదుర్గమ్మ గుడిని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాన్ని చేస్తానని సుజనా చౌదరి అనటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. స్థానికుడికి స్థానికేతరుడికి మధ్య వ్యత్యాసం ఇక్కడే కనబడుతుందని ఎద్దేవా చేశారు.

పక్క రాష్ట్రంలో తల దాచుకున్న వారికేం తెలుస్తుంది

సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండేళ్ల పాటు కోవిడ్ మహమ్మారి విలయ తాండవం చేసినా ప్రజలకు సంక్షేమం ఆపని ప్రభుత్వంపై బురద చల్లటమే చంద్రబాబు, పవన్ కల్యాణ్ పనిగా పెట్టుకున్నారని ఆసిఫ్ మండిపడ్డారు. అయినా కోవిడ్ కష్టకాలంలో పక్క రాష్ట్రంలో తల దాచుకున్న వారిద్దరికి రాష్ట్రంలో ఏం జరిగిందో ఎలా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సీఎం జగన్‌పై దాడికి ఉసిగొల్పుతున్న వారిద్దరూ ఎన్నికల తరువాత మళ్లీ పక్క రాష్ట్రానికే వెళ్లి పోతారని, ఆలోచించి మంచి చేసిన వారికే ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ అభ్యర్థిగా కేశినేని నానిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్‌కుమార్, దుర్గ గుడి, పాత శివాలయం, వక్ఫ్‌బోర్డ్ చైర్మన్లు కర్నాటి రాంబాబు, బొమ్ము మధు, గౌస్ మొహిద్దీన్, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర రాఘవ, యలకల చలపతిరావు, నాయకులు తోలేటి శ్రీకాంత్, ఎస్‌కే నజీర్, ఎద్దు సురేష్, మంటి కోటేశ్వరరావు, జి.వినోద్ పాల్, విజయ్, మంటి రాము, కర్రి మల్లికార్జునరావు, పి.చిన్నా, గౌస్, రాంప్రసాద్(కొండ), రాంబాబు, కటస్ కరిముల్లా, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, లేళ్లపూడి లాజర్, పొదిలి చంటిబాబు, సూరసాని రామిరెడ్డి, ఎస్కే జిలాని పాల్గొన్నారు.



సపోటాలు విక్రయిస్తున్న ఆసిఫ్, నాయకులు

రోబోటిక్ టెక్నాలజీపై సదస్సు

గన్నవరంరూరల్: రోబోటిక్ టెక్నాలజీలో నూతన ప్రయోగాలపై విద్యార్థులకు నిరంతర అవగాహన అవసరమని ప్రొఫెసర్ కె.ఫణిశ్రీనివాస్ అన్నారు. మాదలవారిగూడెం లింగయ్యాస్ ఇంజినీరింగ్ కళాశాలలో హెచ్‌సీఎల్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను వివరించారు. ఇమేజ్ ప్రాసెసింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్‌పై ప్రసంగించారు. హెచ్‌సీఎల్ ప్రతినిధులు, కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎస్.కీర్తి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ సభ్యులకు అభినందనలు



కెనడి, ఎండీఆర్‌ను సత్కరిస్తున్న ఆసిఫ్, నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నియోజకవర్గానికి చెందిన పలువురి నేతలను వివిధ హోదాల్లో నియమించిన నేపథ్యంలో వారిని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మంగళవారం అభినందించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసి జయప్రకాష్ కెనడి, స్టేట్ పార్టీ కమిటీ జాయింట్ సెక్రటరీ మైలవరపు దుర్గారావు(ఎండీఆర్), రాష్ట్ర మహిళా విభాగం కమిటీ జాయింట్ సెక్రటరీ వడ్లాని పూర్ణిమ లతలు పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చి ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసిఫ్, నాయకులు వారిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పశ్చిమలో వైఎస్సార్ సీపీదే విజయం

ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీదే విజయమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్.ఆసిఫ్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 34వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీలతో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ కోట్ల రూపాయలకు పడగలెత్తిన బీజేపీ అభ్యర్థిని పశ్చిమ నియోజకవర్గంలో పోటీలో దించి గెలవాలన్న టీడీపీ, జనసేన పార్టీల ఆశలకు ప్రజలు వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని చెప్పారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఆసిఫ్, పుణ్యశీల తదితరులు

జగనన్నకు బహుమతిగా అందిస్తాం

నియోజకవర్గంలోని ప్రజలందరూ ఐక్యంగా అన్నదమ్ముళ్లుగా, అక్కచెల్లెమ్మలుగా ఉంటామని ఆసిఫ్ చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు కులాలు, మతాలను విడగొట్టి చేసే రాజకీయాలు పశ్చిమ నియోజకవర్గంలో చెల్లవన్నారు. కొండలు, గుట్టలు ఎక్కి ప్రజా సమస్యలు తెలుసుకొలేని నాయకులకు ఇక్కడ స్థానం లేదన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉందో తెలియని ఢిల్లీ బాబును ఇక్కడ డంప్ చేసి గెలవాలనుకోవటం ప్రతి పక్షపార్టీల అవివేకం అన్నారు. రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్, స్థానిక కార్పొరేటర్ నాగేంద్ర పుణ్యశీల మాట్లాడుతూ ప్రజలు జగనన్న లక్ష్యం 175కు 175 సీట్లు అందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పశ్చిమ నియోజకవర్గ సీటును అత్యధిక మెజారిటీతో గెలిచి జగనన్నకు బహుమతిగా అందిస్తామని చెప్పారు. ఇప్పటికే జగనన్న మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజలు సముద్రంగా తరలి రావటాన్ని చూసి ప్రతిపక్ష పార్టీలకు చెమటలు పడుతున్నాయన్నారు. మహాలక్ష్మి, సుధాకర్, శివకుమారి, సుశీల, దుర్గా, గంగయ్య, శివ పాల్గొన్నారు.

సంకల్పానికి శారీరక వైకల్యం అడ్డుకాదు

గుణదల(విజయవాడతూర్పు): జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే సంకల్పం ఉంటే శారీరక వైకల్యాన్ని అధిగమించి అభివృద్ధి సాధించవచ్చని ఎస్ఐఐఎఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ జయిత నహా అన్నారు. ఆంధ్రా లయోల కళాశాలలో అంధ విద్యార్థులకు స్మార్ట్ గ్లాసెస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత ఫలితాలు సాధించాలని కోరారు. శారీరక వైకల్యం ఉన్నంత మాత్రాన అంధ విద్యార్థులు అధైర్య పడకూడదని తెలిపారు. గతంతో పోల్చితే అంధ విద్యార్థులు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం ఇలా అన్నింటిలో తమ ప్రతిభాపాటవాలు చాటుతున్నారని చెప్పారు. ఆధునిక ప్రపంచంలో వస్తున్న సాంకేతికత ద్వారా అంధ విద్యార్థులకు కావలసిన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సౌండ్ కంప్యూటర్, బ్రెయిలీ సిస్టమ్స్, స్మార్ట్ గ్లాసెస్ అంధులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అంధ విద్యార్థులను ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు లయోల కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 10 మంది అంధ విద్యార్థులకు స్మార్ట్ గ్లాసెస్ పంపిణీ చేశారు. లయోల కళాశాల కరెస్పాండెంట్ ఫాదర్ సహాయరాజ్, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి జి.సహాయభాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ గ్లాసెస్ అందుకున్న విద్యార్థులతో జయిత, అజయ్ సింగ్ తదితరులు

ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలు

పెనమలూరు: వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఈ విద్యా సంవత్సరం నుంచి సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీగా మార్పు చెందిందని సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. ఆయన మంగళవారం కాలేజీలో విలేకరులకు వివరాలు తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం బీటెక్ కోర్సులో ప్రవేశించే వారికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ప్రవేశ పరీక్షలు నిర్వహించామన్నారు. వాటి ఫలితాలు విడుదల చేస్తూ ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తూ ప్రవేశాలు ప్రారంభించామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అట్లూరి వెంకట రత్నప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించిన సిద్ధార్థ ఇంజినీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌కు(ఎస్ఈఈఈ-24) విశేష స్పందన లభించిందన్నారు. ఎస్ఈఈఈ ర్యాంకులతో పాటు, జేఈఈ మెయిన్స్, ఎంసెట్, ఇంటర్ ఫలితాలు ప్రామాణికంగా తీసుకుని ప్రతిభ చూపిన 500 మంది విద్యార్థులకు 15 శాతం నుంచి 100 శాతం ఉపకార వేతనాలు ఇస్తామని అన్నారు. బీటెక్ ప్రవేశ పరీక్ష ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.విఆర్‌సిద్ధార్థ.ఎసి.ఇన్‌లో చూడాలన్నారు. సమావేశంలో కన్వీనర్ మలినేని రాజయ్య, డీన్ బావినేని పాండురంగారావు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



ఫలితాలు ప్రకటిస్తున్న పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, కన్వీనర్ రాజయ్య

నేటి నుంచి చెస్ ఉచిత శిక్షణ తరగతులు

విజయవాడస్పోర్ట్స్: గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో చదరంగం వేసవి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు అకాడమీ కార్యదర్శి ఎస్‌కే ఖాసీం తెలిపారు. మొగల్రాజపురంలోని గ్లోబల్ చెస్ అకాడమీ, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, గొల్లపూడి వన్ సెంటర్‌లో ఈ క్యాంపులు కొనసాగుతాయన్నారు. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు మాత్రమే శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి ఏడు గంటల వరకు ఈ కేంద్రాల్లో విడతల వారీగా శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 98495 14138 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేసిన దీవెన ఫౌండేషన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కిడ్నీ, లివర్ వ్యాధితో బాధపడుతున్న యువతికి వైద్యం నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం అందజేసింది. చిట్టినగర్ కలరా హాస్పిటల్ వద్ద నివసిస్తున్న గౌరీ ప్రియాంక(18) డిగ్రీ చదువుతుంది. తండ్రి మరణించడంతో తల్లి రెక్కల కష్టంపై కుటుంబాన్ని పోషిస్తుంది. ఈ క్రమంలో గౌరీ ప్రియాంక అనారోగ్యం కారణంగా గత కొన్ని నెలల నుంచి బాధపడుతూ చికిత్స చేయించుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించటంతో మంగళవారం ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు వన్ ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ, టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ గోపరాజు, కానిస్టేబుల్ బాలరాజు బాధితురాలి ఇంటికి వెళ్లి తమ వంతు సాయంగా రూ.10 వేలు చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబసభ్యులు దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్య, వైద్యం సంబంధిత విషయాల్లో ఇబ్బందుల్లో ఉన్న వారికి కులమతాలకు అతీతంగా తమ వంతు సహాయ సహకారాలను అందించటమే దీవెన ఫౌండేషన్ లక్ష్యమని సభ్యులు పేర్కొన్నారు.



బాధితురాలికి చెక్ అందజేస్తున్న ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం సితార సెంటర్ సమీపంలో గొల్లపూడి బైపాస్ రహదారి పక్కన ఏర్పాటు చేసిన జైపూర్ సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్‌లోని దివంగత గరిమెళ్ల సుబ్బారావు కళావేదికపై కళాకారిణులు ప్రదర్శించిన పలు అంశాలు సందర్శకులను అలరించాయి. నాట్యాచారిణి అనురాధ నేతృత్వంలో ఆమె శిష్యులు 'సాంబశివ అనరే', 'ముద్దుగారే యశోద', 'తాండవ నృత్యకరి', కరగ నృత్యాంశాలకు చక్కని అభియనంతో నర్తించారు. అదే విధంగా జానపద నృత్యాల్లో లంబాడీ, పట్నం ఎల్లొచ్చాడే మావ అనే గీతాలకు డాన్స్ చేశారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు గరిమెళ్ల నానయ్య చౌదరి(నాని) కళాకారిణులకు జ్ఞాపికలను బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌లో కళావేదిక ఏర్పాటు చేసి ప్రతి రోజు సాయంత్రం సమయాల్లో ప్రముఖ నాట్యాచార్యుల దర్శకత్వంలో శిక్షణ పొందిన ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

టీడీపీ చీప్ పాలిటిక్స్‌పై ఆర్వోకు ఫిర్యాదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని అర్థమైన టీడీపీ ఓట్ల కోసం చీప్ పాలిటిక్స్‌కు దిగజారింది. ముస్లిం మైనార్టీ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మతాన్ని అడ్డుపెట్టుకుంటుంది. టీడీపీ విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) తరుపున అతని సోదరి శ్రీదేవి మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. అందులో భాగంగా టీడీపీకే ఓటు వేయాలంటూ ముస్లిం మహిళలతో బలవంతంగా ఒట్టు వేయించుకోవడం, అల్లాహ్‌ను ఎలా చూస్తారో టీడీపీని కూడా అలాగే చూడాలని ఆమె ప్రచారం చేశారు. ఈ విధమైన టీడీపీ నాయకుల ప్రచారంపై ముస్లిం మత పెద్దలు మండిపడుతున్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వారు మంగళవారం రాత్రి జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, నాయకులతో కలిసి ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదు కాపీని చూపుతున్న గౌస్ మొహిద్దీన్, నాయకులు

టీడీపీ వ్యాఖ్యలు దుర్మార్గం

ఈ సందర్భంగా గౌస్ మొహిద్దీన్ మాట్లాడుతూ కేశినేని శివనాథ్ చెల్లెలు శ్రీదేవి తన ప్రచారంలో ఇస్లాం మతాన్ని, మహ్మద్ ప్రవక్తను అభ్యంతరకరంగా ప్రస్తావించి ముస్లింల మనోభావాలను గాయపరచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు మతాన్ని వాడటం ఎన్నికల నియమావళి ప్రకారం నేరంగానే పరిగణించాలన్నారు. అలాగే ఆమె తన ప్రచారంలో టీడీపీకి ఓటు వేయకపోతే రంజాన్ తోఫా కొనసాగదని, టీడీపీకి ఓటు వేయకపోతే ఇస్లాం మతానికి వ్యతిరేకమని అర్థం వచ్చేలా మాట్లాడటం దుర్మార్గమని తెలిపారు. శ్రీదేవి, టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, టీడీపీపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.





భానుడి భగభగలు

జిల్లా వ్యాప్తంగా ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. దీంతో నగర వాసులు గొడుగులు, కర్చీఫ్‌లు, టోపీలు వంటి రక్షణ చర్యలు తీసుకుని రాకపోకలు సాగిస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా మంగళవారం క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ప్రారంభమైన జగద్గురువుల జయంతి ఉత్సవాలు

విజయవాడకల్చరల్: శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో 20 రోజులపాటు నిర్వహించే ఆదిశంకరుల జయంతి ఉత్సవాలు దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై మంగళవారం ప్రారంభమయ్యాయి. దేవాలయ రుత్వికులు ఉదయం ఆదిశంకరులకు పంచామృత అభిషేకం, అర్చన, అష్టోతర శత నామావళి కార్యక్రమాన్ని వేదోక్తంగా నిర్వహించారు. దేవాలయ ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, సభ్యుడు గండూరి చంద్రమౌళి పాల్గొన్నారు. ఆధ్యాత్మికవేత్త శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఆదిశంకరుల విరచిత ప్రస్థానత్రయం అంశంగా ప్రసంగించారు.